క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం రాజమండ్రిలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలు, ఇతర పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో అబ్బయ్యచౌదరితో పాటు వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్ పాల్గొన్నారు.

రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరాజు

దెందులూరు: రైతులు విధిగా ఈ–పంట నమోదు చేయించుకొని పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు, ఉద్యానవన శాఖ అధికారి కరణ్ అన్నారు. బుధవారం చల్ల చింతలపూడిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌలు రైతులు కార్డు తీసుకోవాలన్నారు. ఎకరాకు 840 బీమా నగదు చెల్లించాలన్నారు. ఉద్యానవన పంటల్లో పామాయిల్, కోకో, కొబ్బరి పంటలకు రాయితీ వర్తిస్తుందని ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు.

8 మంది ఏఎన్‌ఎంలకు పదోన్నతి



ఏఎన్‌ఎంలను సత్కరించిన వైద్య సిబ్బంది

దెందులూరు: మండలంలో 8 మంది ఏఎన్‌ఎంలు ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన సుభాషిని, శైలజ, భవాని, నాగలక్ష్మి, బేబి, అనురాధ, మౌనిక, పద్మ వైద్య శాఖలో మరిన్ని మెరుగైన సేవలందించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జి.రాకేష్, రోజ్ లలిత అన్నారు. బుధవారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో పదోన్నతి పొందిన 8 మంది ఏఎన్‌ఎంలను వైద్యాధికారులు ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు అభినందించి సత్కరించారు.

9న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



విశేషాలంకరణలో స్వామి వారు

దెందులూరు: స్థానిక ఇంద్రవనం వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 9న నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. 9వ తేదీన ఉదయం అభిషేకాలు సాయంత్రం విశేషార్చనలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీన 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామన్నారు. అనంతరం మహా అన్న సమారాధన నిర్వహిస్తామని దెందులూరుతో పాటు సమీప గ్రామాల్లో ఉన్న భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గౌరీశంకర ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి

దెందులూరు: పోతునూరులోని శ్రీగౌరీశంకర ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి రూ.25,116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణం త్వరితన పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీగౌరీ శంకర ఆలయ కమిటీ గ్రామస్తులు దాత డీబీఆర్‌కే చౌదరిని అభినందించారు.

ఘాటెక్కిన మిర్చి

- అదే దారిలో కూరగాయలు
- ధరలతో సామాన్యుల విలవిల



పచ్చిమిర్చి



వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గణపవరం: కూర వండాలంటే ఉల్లి, పచ్చిమిర్చి తప్పనిసరి. ఈ రెండూ ఉంటే ఏదోలా ఆ పూట గడిపేయొచ్చు. అయితే కూరకు అత్యవసరమైన ఉల్లి, మిర్చి ధరలే అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఉల్లి కిలో రూ.40 నుంచి రూ.50 పలుకుతుండగా పచ్చిమిర్చి ధర ఘాటెక్కింది. రికార్డు స్థాయిలో కిలో రూ.100 నుంచి రూ.120 పలుకుతుంది. గత రెండు వారాలుగా కిలోరూ.120 పలికిన మిర్చి ధర ఈవారం కాస్త తగ్గి కిలోరూ. 100 నుంచి రూ.110 పలికింది. ఇదే తరహాలో కూరగాయల ధరలు కొండెక్కడంతో వినియోగ దారులు గగ్గోలు పెట్టారు. కూరగాయల ఖర్చు పెరిగిపోవడంతో పేద మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. మార్కెట్లో కూరగాయల ధరలు వింటేనే కళ్లు బైర్లుకమ్ముతున్నాయి. డైలీ మార్కెట్‌లో కూరగాయల ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపుసంతలో కూరగాయల ధరలు వినియోగదారుల గూబ గుయ్యిమనిపించాయి. దీంతో వినియోగదారులు కూరగాయలు సగానికి సగం తగ్గించి కొనుగోలు చేశారు. సంతలో పలు రకాల కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లి కిలో రూ.40, పచ్చిమిర్చి రూ.110, బీర రూ.60, వంకాయలు రూ.60, బెండ రూ.50, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, దోస రూ.40, దొండ రూ.40, కాకర రూ.60, ఆకాకర రూ.80, కీరదోస రూ.80, కంద రూ.50, చిక్కుడు రూ.120, టమాట రూ.40, అల్లం రూ.80, మునగ రూ.10, ఆనబ రూ.30, బీన్స్ రూ.60, క్యాప్సికం రూ.50, క్యాబేజి రూ.30, కాలిఫ్లవర్ రూ.30 చొప్పున పలికాయి. ఆకుకూరల ధరలూ భగ్గుమన్నాయి. తోటకూర, గోంగూర, పాలకూర తదితర రకాలు కట్ట రూ.20 చొప్పున విక్రయించారు.

సామాన్యులకు భారంగా కూరగాయలు



కూరగాయలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారి అందుబాటులో లేకుండా పోతున్నాయి. వారపు సంతకు వెళితే రూ.500 పెడితేనే వారానికి సరిపడా కూరగాయలు వస్తున్నాయి. డైలీ మార్కెట్‌లో అయితే ఇక కొనే పరిస్థితి ఉండటం లేదు. ఏ కూర వండాలన్నా అవసరమైన ఉల్లి, మిర్చి ధరలు అందుబాటులో లేవు. మిగిలిన కూరగాయల ధరలూ ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కూరగాయలు రికార్డు స్థాయిలో ధలు పలుకుతున్నాయి.

– కాన్వెంట్ శ్రీను, బువ్వనపల్లి

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



శ్రీసీతారామ స్వామివార్లు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుండుగొలనులోని శ్రీసీతారామస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిఏటా తిరుమల తిరుపతిలో జరిగే వార్షికోత్సవాల తరహాలో ఇక్కడ సీతారామస్వామి వార్లను వార్షికోత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక హోమ పూజలు చేశారు. శైవాధివాసం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఈ నెల 7వ తేదీతో వార్షికోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలను అందించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



పాతూరు పాఠశాలలో విద్యార్థుల వర్క్‌బుక్కులను పరిశీలిస్తున్న ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని భీమడోలు ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల కార్యక్రమాల నిర్వహణ రికార్డులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించి పలు సూచనలందించారు. ఉపాధ్యాయులు డైరీలు, విద్యార్థుల వర్క్, నోట్ పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఎండీఎం రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల్లోని అభ్యసనా స్థాయిని ఆయన గుర్తించి బోధనల్లో మరింత మెలకువలను పాటించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అందించాలని హెచ్‌ఎం కె.రఘురామరాజు తెలిపారు. అనంతరం ఎండీఎం భోజనాన్ని రుచిగా, శుచిగా వండి చిన్నారులకు అందించాలని ఎండీఎం నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రఘురామరాజు, టీచర్ మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్లు మంజూరు చేయాలి



ఆందోళన చేస్తున్న విలేకరులు

ఉంగుటూరు: పత్రికా విలేకరులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండు చేస్తూ ఉంగుటూరు మండల పత్రికా విలేకరులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ మేరకు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల్లో ప్రాధాన్యం కల్పించాలని, ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి త్రైపాక్షిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, ప్రమా ద బీమాను తక్షణం అమలు చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందజేయాలని, ఇళ్ల నిర్మాణానికి పూర్తి ఆర్థిక సాయం ప్రభుత్వమే భరించాలని డిమాండు చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా విశ్రాంత పాత్రికేయులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: వేగవరం హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నిర్వహించే స్టెనోగ్రాఫ్ పరీక్షలు జరుగుతాయని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం వేగవరం కళాశాలను ఆమె పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయని వివరించారు.

విద్యార్థులకు అసెస్‌మెంట్ పుస్తకాలు



ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న కాంప్లెక్స్ చైర్మన్ నరేష్‌బాబు, సీఆర్‌పీ దాసు

గణపవరం: విద్యార్థులు ఇక నుంచి పరీక్షలు రాయడానికి తెల్ల పేపర్లు అవసరం లేదు. విద్యాశాఖ నూతనంగా సరఫరా చేసిన అసెస్‌మెంట్ పుస్తకాల్లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలు అందజేస్తున్నారు. గణపవరం, నిడమర్రు మండలాల్లోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా వీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 11 నుంచి జరగనున్న ఫార్మేటివ్–1 పరీక్ష నాటికి పుస్తకాల్లో విద్యార్థికి సంబంధించిన సమాచారాన్ని నింపి పుస్తకాలను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈవోలు సూచించారు.

తెలుగు అధ్యాపకుడికి సత్కారం



వెంకటరమణను సత్కరిస్తున్న అధ్యాపక సిబ్బంది

గణపవరం: బెంగుళూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బెంగుళూరులో రెండు రోజులు నిర్వహించిన అంతర్జాతీయ సాహిత్య సమాలోచనలో గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి తెలుగు అధ్యాపకుడు జి.వెంకటరమణ పాల్గొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సాహిత్య సమాలోచన సదస్సులో వెంకటరమణ ఆచార్య కె.ఆశాజ్యోతి తేరు నవల, రచయిత్రి ధృకృథం అనే అంశంపై పత్రాన్ని సమర్పించారు. ఇందుకుగాను వెంకట రమణను సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు.

స్మార్ట్ మీటర్లపై కూటమి సర్కారు ద్వంద్వ నీతి



భీమడోలు: పొలసానిపల్లి ఏడీఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు



గణపవరం: విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

భీమడోలు: ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టమని, గెలిచాక కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించడం సిగ్గు చేటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు విమర్శించారు. పొలసానిపల్లిలోని ఏడీఈ కార్యాలయం వద్ద మంగళవారం అదానికి లాభాలు ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ భీమడోలు ప్రజా వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు కూటమి ప్రభుత్వం మోదీ ఆదేశాలతో అదానీ లాభాల కోసం ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. పాత మీటర్లనే కొనసాగించాలని, వ్యాపార, వాణిజ్య సంస్థలకు బిగించాలని, వారికి బిల్లులు నాలుగు రెట్లు వస్తున్నాయన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 26వ తేదీన విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మహోద్యమానికి సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, యువజన సంఘం నాయకులు పోలుకొండ నాగరాజు, తానిగడప రత్తయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను ధ్వంసం చేయండి

గణపవరం: ఎన్నికల ముందు మంత్రి లోకేష్ ఇచ్చిన పిలుపు మేరకు స్మార్ట్ మీటర్లను బిగిస్తే వాటిని పగులగొట్టాలని సీపీఎం నాయకులు ప్రజలకు పిలుపు ఇచ్చారు. మంగళవారం మండలంలోని పిప్పరలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి చేస్తున్న నిలువు దోపిడికి నిరసనగా ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.గోవింద్, పి.నర్సింహమూర్తి తదితరులు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, పెంచిన చార్జీలు తగ్గిస్తామని, చంద్రబాబు, స్మార్ట్‌మీటర్లు బిగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు తిరగబడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంటారావు, గుత్తుల శ్రీనివాస్, నరాలశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సదరం క్యాంపులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఈ నెల 6వ తేదీన సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. 6వ తేదీన చేబ్రోలు పీహెచ్‌సీ, 7వ తేదీన కాగుపాడు పీహెచ్‌సీల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, క్యాంపు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన



వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉంగుటూరు: మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా 535కు పైగా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని ఎంపీడీవో జీఆర్ మనోజ్ అన్నారు. ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009ను ఉపయోగించుకొని పై సేవలు పొందాలని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి మంగళవారం మధ్యాహ్నం ఉంగుటూరులో ఒక అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పలు శాఖల అధికారులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం



గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న పీడీ శారద

దెందులూరు: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం ఆరోగ్యమని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద అన్నారు. బుధవారం మండలంలోని పోతునూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలలో మాంసకృతులు, విటమిన్లు, కాల్షియం, ఖనిజ లవణాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. తల్లిపాలు ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి రోజే పట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు ఏఎన్‌ఎం వైశాలి, ఎంఎల్‌హెచ్‌పీ కావేరి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకం

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకాన్ని పోత్సహిస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవో ఫాతిమా అన్నారు. బుధవారం టెక్నికల్ అసిస్టెంట్ దీప్తి ఏపీవో ఫాతిమా పెరుగ్గూడెం గ్రామంలో వేసిన కొబ్బరి మొక్కలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఒక్కో సంవత్సరానికి 60 కొబ్బరి మొక్కల పెంపకానికిగాను రూ.993 పూర్తి సబ్సిడీ ఇస్తున్నారన్నారు. ఇలా మూడేళ్ల పాటు మెయింటినెన్స్ చాఇర్జీలు ఉపాధి హామీ పథకం రైతు బ్యాంకు ఖాతాకు జమ చేస్తారన్నారు. పెరుగ్గూడెం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపవరంలో సమస్యలు తీర్చండి

గణపవరం: ఏళ్ల తరబడి గణపవరం పట్టణాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, కూలడానికి సిద్ధంగా శిథిలావస్థలో ఉన్న బొబ్బిలి వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వ హించిన గ్రామ సభలో ఈ మేరకు పట్టణంలో సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. గణపవరంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీ, పారిశుద్ధ్య సమస్యలు తీర్చాలని, ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని, జగనన్న కాలనీలో కనీస సదుపాయాలు కల్పించాలని, అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, బస్టాండులో సమస్యలు తీర్చాలని పలు సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.పెంటారావు, కె.త్రినాథ్, పి.నర్సింహమూర్తి, ఎంపీడీవో బేబీశ్రీలక్ష్మి, తహసీల్దార్ అప్పారావు, సర్పంచ్ మూర అలంకారం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి



పిప్పర పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాభాయి

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వ్యాధుల వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని వైద్య సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి జి.గీతాభాయి అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల నిర్మూలన చర్యలపై ఆరా తీశారు. గ్రామాల్లో మురుగునీటి గుంటలు, చెత్తాచెదారం లేకుండా చూడాలని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు వైద్యసేవలు పూర్తి స్థాయిలో సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై, ఎన్‌డీడీ కార్యక్రమం నిర్వహణపై సూచనలిచ్చారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.శ్రీదివ్య, పీహెచ్‌ఎన్ అన్నాకుమారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులకు మూలం నులిపురుగులు

నులిపురుగులతో అనేక రకాల రోగాలు వస్తాయని, రోగాలకు దూరంగా ఉండాలంటే నులిపురుగులను నివారించడమే మార్గమని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన వారికి విధిగా ఆల్‌బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఈ లోపు ఇంటింటి సర్వే నిర్వహించి, ఈ వయస్సు కలిగిన వారిని గుర్తించాలన్నారు. అన్ని విద్యా సంస్థల విద్యార్థులకు ఈ మాత్రలు ఇవ్వాలని సూచించారు. నులిపురుగులు శరీరంలో ప్రవేశిస్తే రక్తహీనత వస్తుందని, తద్వారా అనేక రోగాలకు గురవుతారని వివరించారు. అనంతరం నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.